క్లుప్తంగా

హామీలు అమలు చేయండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వలేదన్నారు. అదే విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు రీజినల్ కోఆర్డినేటర్‌గా ఎంపీ మిథున్‌రెడ్డిని నియమించడం హర్షణీయ మన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, రీజినల్ కోఆర్డినేటర్ నాయకత్వంలో గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

పాడి రైతులకు రుణాలు ఇవ్వాలి



గోవుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పావగడ: వీఎస్ఎస్ఎన్ (వ్యవసాయ సహకార సంఘాల)ల నుంచి పాడి రైతులకు రుణాలు ఇప్పించాలని ఎమ్మెల్యే వెంకటేశ్ ఎమ్మెల్సీ, డీసీసీబీ డైరెక్టర్, మంత్రి కేఎన్ రాజణ్ణ తనయుడు రాజేంద్రను కోరారు. తాలూకాలోని గుమ్మఘట్టలో సోమవారం వారు నూతన వీఎస్ఎస్ఎన్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం వారు పశు వైద్య కేంద్రంలో గాలికుంటు వ్యాధుల నివారణకు పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తర్వాత సీకేపురం, నాగలమడక, లింగదహళ్లి, పొన్నసముద్రం గ్రామాల్లో నిర్మించిన వీఎస్ఎస్ఎన్ కార్యాలయ భవనాలను ప్రారంభించారు.

సమస్యలపై అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రజలు అర్జీల రూపంలో తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తహసీల్దార్ కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంపీడీఓ సోనిబాయి తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించండి



హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న జడ్జి అశోక్‌కుమార్

మడకశిర: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్‌ను సోమవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ తనిఖీ చేశారు. ప్రధానంగా హాస్టల్ గదులను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. భోజన నాణ్యతపై ఆరా తీశారు. తాగునీరు,మరుగుదొడ్లు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. హాస్టల్‌లో శుభ్రతను పాటించాలన్నారు.

ఏపీఆర్ఎస్‌ను సందర్శించిన ఎస్కేయూ సీఈఓ



మాట్లాడుతున్న ఎస్కేయూ సీఈఓ చంద్రమౌళి

పరిగి: మండలంలోని ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి పాఠశాలను అనంతపురం ఎస్కే యూనివర్సిటీ అటల్ ఇంకుబేషన్ సెంటర్ సీఈఓ చంద్రమౌళి సోమవారం సందర్శించారు. పాఠశాలలోని ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచి వారిలోని నైపుణ్యాలను వెలికితీయాలన్నారు. దీనికోసం పాఠశాలలో అటల్ ఇంకుబేషన్ సెంటర్ ల్యాబ్‌ను పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాల్మన్‌రాజ్, అశ్వర్థనారాయణ, సుదర్శన్ పాఠశాల ఉపాధ్యాయులు నాగమోహన్, పర్వీన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్ సజావుగా జరిగేనా?

- చిలమత్తూరు సర్వసభ్య సమావేశంపై టీడీపీ కుటిల రాజకీయం
- అల్లరి మూకల చేష్టలతో గత సమావేశం వాయిదా
- ఎంపీపీ పదవి కోసం అభివృద్ధిని ఆపుతున్న వైనం
- రేపు జరగనున్న సమావేశంపై అందరి దృష్టి



చిలమత్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం



సమావేశానికి వెళ్లకుండా గతంలో ఎంపీపీని హౌస్ అరెస్ట్ చేసిన దృశ్యం (ఫైల్)

చిలమత్తూరు: మండల సర్వసభ్య సమావేశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈనెల 23న సమావేశం నిర్వహించనున్నారు. గతంలో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మరోసారి అందరి దృష్టి ఈ సమావేశంపై పడింది.

ఎంపీపీ పదవిపై కన్ను

తొమ్మిది నెలలుగా ఏదో ఒక కారణంతో సమావేశం వాయిదా పడుతూ వచ్చింది. ఎన్నికల కోడ్ కారణంగా జరిగిన ఓ సమావేశం ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాల చర్చ లేకుండా సాగింది. జూలై 27న జరగాల్సిన సర్వసభ్య సమావేశం టీడీపీ నేతల కుటిల రాజకీయం కారణంగా వాయిదా పడింది. ఎంపీపీ సమావేశానికి హాజరు కాకుండా టీడీపీ అల్లరి మూకలు అడ్డుకోవాలని, ఎంపీపీపై దాడి చేయాలని చూశాయి. దీనికి తోడు జెడ్పీటీసీ సభ్యురాలు అనూష మామ నాగరాజు యాదవ్ ఎలాగైనా ఎంపీపీ పదవి తన అనుచరులకు దక్కాలన్న దురాశతో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలలో నలుగురిని తనవైపు తిప్పుకున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శిస్తున్నారు. ఎంపీపీ పురుషోత్తమరెడ్డిని మూడు సమావేశాలకు రానివ్వకుండా అడ్డుకోవడం ద్వారా ఎంపీపీ పదవి నుంచి డిస్క్వాలిఫై చేసి తన వైపు ఉన్న ఎంపీటీసీకి ఎంపీపీ పదవి కట్టబెట్టాలని ప్లాన్ చేశారంటున్నారు. అయితే టీడీపీలోనే మరో వర్గం.. వాళ్ల వైపు ఆరుగురి ఎంపీటీసీలను ఇప్పటికే బలవంతంగా టీడీపీలోకి చేర్చుకుంది. మరో ఇద్దరు ఎంపీటీసీలు బయట నుంచి మద్దతు ఇచ్చేలా మాట్లాడుకున్నారు.

ఎంపీపీకి బెదిరింపులు

ఒక్క ఎంపీటీసీ స్థానం కూడా గెలవని టీడీపీ... ఎంపీపీ పదవి దక్కించుకోవాలని కుటిల రాజకీయాలకు తెరతీసింది. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ఎంపీపీ పదవిపై కన్నేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెరగబడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే టీడీపీ నేతలు లా అండ్ ఆర్డర్‌ను తమ చేతుల్లోకి తీసుకొని సర్వసభ్య సమావేశం రోజున నానా హంగామా చేశారు. పోలీసులను కూడా బెదిరించి పంపించి వేయడం, వాయిదా పడ్డ తర్వాత గత జూలై 27న సమావేశం తిరిగి నిర్వహించాల్సి ఉండగా ఎస్పీ భారీ భద్రత ఏర్పాటు చేశారు. అయితే టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు ఎంపీపీపై అక్రమ కేసులు పెడతామని బెదిరించి సమావేశానికి రాకుండా చేశారు. దీంతో సమావేశం నిరవధికంగా వాయిదా పడింది.

అభివృద్ధికి అడుగడుగునా అడ్డు

మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సర్వసభ్య సమావేశంలో చర్చించి తీర్మానం చేసి అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే రెండు సమావేశాలలో ఎలాంటి చర్చ సాగకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నిధుల మంజూరు కూడా ఆగిపోయింది.

సమావేశంపై అందరి దృష్టి

బుధవారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగేలా చేసి అభివృద్ధి పనులు జరిగేలా టీడీపీ నేతలు సహకరించాలని చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు అధికారులు మాత్రం యథావిధిగా సమావేశం ప్రకటన ఇచ్చేశారు. అయితే సభ సజావుగా జరిపేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారో మాత్రం చెప్పడం లేదు.

పోలీసులు బెదిరింపులు ఆపేరా?

గత సమావేశంలో పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించి అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ఎంపీపీని సమావేశానికి రాకుండా బెదిరింపులకు గురిచేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నారు. బుధవారం జరిగే సమావేశం సందర్భంగా పోలీసులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న చర్చ సాగుతోంది.ఈసారి అయినా సమావేశం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అందరూ సహకరించాలి

మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరగనుంది. ఈ సమావేశం సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి. నాపై కక్ష సాధింపుతో అభివృద్ధి పనుల కోసం నిర్వహించే సమావేశం అడ్డుకుంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరై మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలి.

– పురుషోత్తమరెడ్డి, ఎంపీపీ

సజావుగా నిర్వహిస్తాం

మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరుగుతుందని భావిస్తున్నాం. ప్రతిసారి సమావేశం వాయిదా పడితే ప్రజలకు ఇబ్బందులొస్తాయి. సమావేశం సజావుగా జరిగేలా ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఇప్పటికే సమాచారం అందించాం.

– రమణమూర్తి, ఎంపీడీఓ

పాఠశాల తనిఖీ

అగళి: మండల పరిధిలోని ఆలూడి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ-2 చంద్రశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

భూమి ఇప్పించి న్యాయం చేయండయ్యా..

పెనుకొండ రూరల్: తమ భూమి తమకు ఇప్పించాలంటూ సోమ్లానాయక్ దంపతులు ఆర్డీఓను ఆశ్రయించారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఈ మేరకు ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని అడదాకులపల్లిలో సర్వే నంబర్ 10లో 5 ఎకరాల భూమి తమ తండ్రి నీరుగంటి హనుమేనాయక్ పేరు మీద ఉండేదన్నారు. తన తండ్రికి ఇద్దరు భార్యలు ఉండగా చిన్న భార్యకు చెందిన సంతానమే భూమి అనుభవిస్తున్నారని, అందులో సగం తమకు రావాల్సి ఉందన్నారు. న్యాయం చేయాలని విన్నవించారు. డివిజన్ వ్యాప్తంగా జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమానికి మొత్తం 17 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

అనుమానితుల ఇళ్లలో సోదాలు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని అనుమానితుల ఇళ్లలో సోమవారం ఉదయం పోలీసులు సోదాలు నిర్వహించారు. కొంతకాలంగా గంజాయి స్థానికంగా చలామణి అవుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ రమేష్‌బాబు, రాజేష్, వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో పలువురి ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆరుగురికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ముగిసిన భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న స్కౌట్ విద్యార్థులు

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ విశిష్టతను గురించి స్కౌట్ మాస్టర్లు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మురుగు కాలువ శుభ్రం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ముందున్న మురుగు కాలువను ఆస్పత్రి సూపరింటెండెంట్ మోహన్‌నాయక్ సోమవారం శుభ్రం చేయించారు. కొన్నినెలలుగా ఆస్పత్రి ముందున్న డ్రైనేజీ కాలువ చెత్తా చెదారంతో నిండిపోయింది. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో సూపరింటెండెంట్ సొంత డబ్బుతో ట్రాక్టర్ల ద్వారా కాలువలోని మట్టి, చెత్తా, చెదారాన్ని పట్టణ శివార్ల అవతలకు తరలించి శుభ్రం చేయించారు.

అంగన్‌వాడీ వర్కర్లను వేధించడం ఆపండి

హిందూపురం టౌన్: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడవక ముందే అంగన్‌వాడీ వర్కర్లను వేధించడం బాధాకరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఐసీడీసీ కార్యాలయంలో సీడీపీఓ రెడ్డిరమణమ్మకు ఈమేరకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కరించి, అండగా ఉంటామని చెప్పారన్నారు. అయితే ఇప్పుడు మహిళా నాయకురాళ్లు విజిట్ పేరుతో నారా లోకేష్ చెప్పారు.. మేము అన్ని సెంటర్లకి విజిట్ వెళ్తాం, మీరు ఎవరికైనా చెప్పుకోండి అని బెదిరిస్తున్నారన్నారు.



సీడీపీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అంగన్‌వాడీ వర్కర్లను ఇదే పద్ధతిలో ఇబ్బందులకు గురిచేస్తే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాము, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శోభమ్మ, కార్యదర్శి లావణ్య, సెక్టర్ లీడర్స్ శైలమ్మ, విజయలక్ష్మి, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన



హల్బిన్ కాలనీ వద్ద డ్రైనేజీ పొంగడంతో నిలబడిన వర్షం నీరు

పెనుకొండ రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం వాన దంచి కొట్టింది. విడతల వారీగా వర్షం పడటంతో పంట పొలాల్లో నీరు నిలిచింది. పట్టణంలోని ప్రధాన రహదారుల్లోని డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లాయి.

ఇసుక తరలింపు ఆపండి

హిందూపురం టౌన్: మండల పరిధిలోని సంతేబిదనూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో పెన్నా నది బ్రిడ్జి వద్ద కొంత మంది ఇసుకను తరలిస్తున్నారని, దాన్ని అడ్డుకోవాలని సంతేబిదనూరుకు చెందిన ప్రజలు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

మడకశిరరూరల్: విద్యతో పాటు విద్యార్థినీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రభుత్వ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినిదేవి తెలిపారు. సోమవారం ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా రక్షణ సెల్ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య సమస్యలపై వైద్య శిబిరం నిర్వహించారు. కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది విద్యార్థినులకు వైద్య చికిత్సలు, రక్త పరీక్షలు నిర్వహించారు. మహిళ రక్షణ సెల్ చైర్మన్ సుమతి , ఏఎన్ఎం ఉషాలత, తదతరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కోనాపురం రహదారి



పెనుకొండ పట్టణంలోని కోనాపురం రహదారి దుస్థితి



రహదారి మధ్యలో గుంతలు పడగా వర్షపు నీరు చేరిన దృశ్యం

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయితీ పరిధిలోని పెనుకొండ – కోనాపురం రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహం నుంచి కోనాపురం వరకూ రోడ్డుకు గుంతలు పడ్డాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లలోని గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ప్రజలు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్డు బాగా లేదని రోడ్డుపై వరి నాట్లు వేసిన ప్రస్తుత మంత్రి సవితతో పాటు ఇతర కూటమి నాయకులు ప్రస్తుతం ఆ రోడ్డు బాగాలేకున్నా మౌనం వహిస్తుంచడం సరికాదని పలువురు విమర్శిస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ‘పురం’ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన పురం విద్యార్థులు

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన విద్యార్థులు జాతీయస్థాయి గ్రాప్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. జూలైలో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో హితేష్ శ్రీ చరణ్, సయ్యద్, యాహియా, నందకిశోర్, అర్షద్, కెఎం ఉసామా ఖాన్, కిషన్ సింగ్ రాజ్‌పుత్ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌స్ట్రక్టర్ చరణ్‌రాజ్ తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో నవంబర్ 18 నుంచి 20 వరకూ జరిగే జాతీయస్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలి మృతి

చిలమత్తూరు: మండలంలోని కంబాలపల్లిలో మతిస్థిమితం కోల్పోయిన శివమ్మ (85) అనే వృద్ధురాలు ఆదివారం రాత్రి మృతి చెందింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్ఐ మునీర్ అహ్మద్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆమె సోమందేపల్లి వాసి అని, వారం రోజులుగా తన తల్లి కనిపించడం లేదని మృతురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వృద్ధురాలు కనీసం ఆహారం కూడా తీసుకోకుండా ఉండటంతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని బంధువులకు అప్పజెప్పామన్నారు.

హౌసింగ్ ఏఈగా కిశోర్

రొళ్ల: మండల గృహ నిర్మాణశాఖ ఏఈగా కిశోర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వర్క్ ఇన్‌స్పెక్టర్ రుద్రప్ప, తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

చెట్ల నరికివేత ఆపండి

హిందూపురం అర్బన్: ‘మండల పరిధిలోని మలుగూరు గ్రామంలో డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా ఉన్న చెట్లను నిబంధనలకు విరుద్ధంగా నరివేసేందుకు పెనుకొండ అటవీ అధికారులు అనుమతులు ఇచ్చారు. అడ్డుగా ఉన్న చెట్లు ఒకటి, రెండు ఉంటే నరికి మిగిలిన వాటిని అలాగే వదిలేలా చర్యలు తీసుకోండి’ అని సోమవారం కలెక్టర్ చేతన్‌కు పర్యావరణ వేత్త భాస్కరరెడ్డి వినతిపత్రం అందించారు.

నేడు చేపల చెరువు వేలం

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామ సచివాలయంలో మంగళవారం ఈఓఆర్డీ నాగముని ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు హేంజేరు చెరువులో చేపల పెంపకంపై వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి నరేష్, సర్పంచు తిప్పేస్వామి తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

మడకశిర: నియోజకవర్గంలోని దేవాలయాల్లో కమిటీ సభ్యులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మడకశిర రూరల్, అర్బన్ సీఐలు రాజ్‌కుమార్, రామారావు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఇటీవల కాలంలో ఆలయాల్లోని హుండీలను దొంగలు పగలగొట్టి చోరీ చేస్తున్నారని, ఈ నేపథ్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగలను గుర్తించడానికి సులభంగా ఉంటుందన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

లేపాక్షి: మండల వెలుగు కార్యాలయం (శ్రీశక్తి భవనం)లో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షురాలు వెంకటరత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిదులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

గోరంట్ల: స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో సోమవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన సమావేశానికి ఏర్పాట్లు చేయగా 20 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను కేవలం ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. కోరంలేకపోవడంతో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన సమావేశాన్ని తొలుత 4 గంటలకు వాయిదా వేశారు. అప్పుడు సైతం ఎంపీటీసీ సభ్యుల సంఖ్య పెరగకపోవడంతో మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ నరేంద్ర ప్రకటించారు.

సంక్షిప్త సమాచారం

ఈ–స్టాంపులు అధిక ధరలకు విక్రయంపై ఫిర్యాదు

మడకశిర: పట్టణంలో కొంత మంది వెండర్లు ఈ–స్టాంపులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సోమవారం సంబంధిత అధికారులకు స్థానిక ప్రజలు ఫిర్యాదు చేశారు. ఇష్టారాజ్యంగా ఈ–స్టాంపులను విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.20 ఈ–స్టాంపును రూ.130, రూ.50 ఈ–స్టాంపును రూ.250 చొప్పున విక్రయిస్తున్నారని, వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధిక ధరలకు విక్రయిస్తున్న వారి లైసెన్స్‌లను రద్దు చేయాలని ఫిర్యాదులో కోరారు.

నేడు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

రొళ్ల: స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ బాలప్రణీత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్య సిబ్బంది తదితరులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఆలయాన్ని తొలగించొద్దు

పావగడ: తాలూకాలోని కేటీ హళ్లి గ్రామం చెరువు ప్రాంగణం లో నిర్మించిన చాముండేశ్వరీ దేవాలయాన్ని ఆక్రమణ పేరుతో తొలగించొద్దని వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు తహసీల్దార్ వరదరాజుకు విజ్ఞప్తి చేశారు. స్థానిక తాలూకా కార్యాలయంలో సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఆలయంతో పాటు నిరుపేదలకు చెందిన 30 ఇళ్లను సైతం తొలగించాలని నోటీసులు పంపడం అన్యాయమన్నారు. వెంటనే నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం అందించారు. నాయకులు శరణ్, మంజు భార్గవ్, శ్రీనివాస్, సంజయ్, సుమన్ పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

లేపాక్షి: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ముందున్న జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే.. చిలమత్తూరు మండలం తమ్మినాయనిపల్లికి చెందిన శ్రీకాంత్ హిందూపురం మండలం బీరేపల్లి వద్ద కియాకు చెందిన ఫ్యాక్టరీలో పని ముగించుకుని వెళ్తున్నాడు. అయితే లేపాక్షిలోని పిల్లిగుండ్ల జాతీయ రహదారి పక్కకు ఆగివున్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను అటువైపుగా వస్తున్న జనసేన నాయకుడు ఆకుల ఉమేష్ గుర్తించి 103 వాహనంలో చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని మెళవాయి గ్రామంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతిని వాల్మీకులు ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాల్మీకి చిత్రపటంతో మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చారు. వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

మూడు గ్రామాల్లో ‘పల్లె పండుగ ’

మడకశిరరూరల్: మండల పరిధిలోని అయ్యవారిపల్లి, ఎం రంగాపురం, కల్లుమర్రి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పాల్గొన్నారు. సీసీ రోడ్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

మడకశిర: పట్టణంలోని పోలీసు అమరవీరుల మెమోరియల్ పార్కులో సోమవారం పోలీసులు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. రూరల్ సీఐ రాజ్‌కుమార్, అర్బన్ సీఐ రామారావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ర్యాలీగా అమరువీరుల మెమోరియల్ పార్కుకు చేరుకుని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు విడిచిన పోలీసుల త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, పోలీసులు పాల్గొన్నారు.

అగళి: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాణ త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎస్ఐ వీరేష్ పేర్కొన్నారు. పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

అమరాపురం: పోలీసు అమర వీరులకు పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు.



మడకశిరలో పోలీస్ అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం అమరాపురం పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐ రామంజనేయులు ఆధ్వర్యంలో అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.



అమరాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

గుడిబండ: పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మునిప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, సైనిక్ స్కూల్ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. అంతకు ముందు అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. అనంతరం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.